# అతుకుపడ్డ సౌందర్యం

నల్లరాతిలాంటి రాత్రిమీద ఉలితో నగిషీలు చెక్కుతున్నట్టు మద్దెల చప్పుడూ, నిశ్శబ్దంమీద సన్నపోగారు పనితనంలాంటి నాజూకు కంఠాలూ, అలవోకగా కదిలి నర్తించే గాజుల చిరునవ్వులూ — గోడకు వేళ్ళాడుతున్న ఫోటోలాంటి కిటికీలో నాముందు సినిమాలాంటి సజీవ చిత్రం! పైన వేలాడుతున్న వెలుగుబుట్టలోంచి రాలిపడిన కాంతి కిరణాలు ఆ గదినిండా నిండుగా; రాగం ప్రవాహమై పారుతున్న ఆ గదిలో ప్రవాహాన్నుంచి తప్పించుకొని ఒడ్డుకు కొట్టుకొచ్చి, నురగల్ని యిసుకమీద పరచిన కెరటంలా అప్పుడప్పుడు పదుగురి కంఠాల్లోంచి విడిపోయి తెల్లటి చిరునవ్వుల్ని వొదులుతోంది ఒక్కో కంఠం. వెలుగు కిరణాలు చిరునవ్వుల నురగమీదపడి సప్తవర్ణాలు చెదిరి, ఆ గదినిండా రకరకాల రంగులు ఎగురుతున్నాయి. ఆ రంగులమధ్య పచ్చని తివాసీమీద సిగ్గుతో ముడుచుకుపోయిన కలువలా కూర్చుని, ఆలోచనల్లోకి వాలిపోయినట్టు చూపుల్ని కిందకువంచి, బుగ్గల్లో అప్పుడప్పుడూ పూసిన సిగ్గుపూలను ఎవరికీ కనిపించనీయకుండా మోకాలిమీద తలనువాల్చి, వెలుగు కిరణాల్నుండి బుగ్గల్ని దాచుకుని రాతిబొమ్మలా కూర్చుంది యూసఫా.

యూసఫాను పెళ్ళికూతుర్ని చేస్తున్నారు. ఇద్దరాడవాళ్ళు ఆమె కాళ్ళకు, చేతులకు గోరింటాకు పెడుతున్నారు. ఆమెచుట్టూ ఏడెనిమిదేళ్ళ పిల్లలు పదుగురుచేరి ఆమె ముఖంలోకి చూస్తూ కూర్చున్నారు. నీలాలలాంటి ఆ పాపల కళ్ళు కెంపుల్లా మెరసిపోతున్న ఆమె పెదవులమీద, ఎర్రని జరీ అంచుల ముసుగుమీద, సిగ్గుతో వాలుచూపులు చూస్తోన్న ఆమె నల్లంచుల కళ్ళచుట్టూ తిరుగుతున్నాయి. ఆమె పచ్చని చెక్కిళ్ళు క్షణంలో ఎర్రబడి గులాబిరేకులై సిగ్గును దాచుకుని తిరిగి పచ్చబడుతున్నాయి.

ఆమె ఎదురుగా మరో తివాసీమీద ఆడాళ్ళు కూర్చున్నారు. ఒకామె మద్దెల వాయిస్తోంది. అలా వాయిస్తోనే కమ్మగా ఏదోపాట పాడుతోంది.

మిగిలినవాళ్ళుకూడా ఆమెతోపాటే ఆమె కంఠంలో తమ కంఠాల్ని అల్లుకొని పాడుతున్నారు. మద్దెల వాయిస్తోన్న ఆమె మోచేతివరకూ నిండుగా ఎర్రటి గాజులు వేసుకుంది. వింతగా కదిలి నాట్యం చేస్తున్నాయవి. సన్నని ఆ గాజుల శబ్దాన్ని కౌగలించుకుని మద్దెల మోగుతోంది.

ఆ పాటకు నాకు అర్థం తెలీదు. బహుశా అవి పెళ్ళికూతురిమీద పాడే పాటలేమో. ఆమెకు నయబోధచేసేవి, సిగ్గిల్లచేసేవి కావచ్చు. అప్పుడప్పుడు పెళ్ళికూతురి ప్రస్తావనవున్న సినిమా పాటలుకూడా పాడుతున్నారు. వాటికి అర్థం తెలియకపోయినా, సినిమాలో పాటపాడే భాగాన్ని గుర్తుచేసుకుని, అర్థాన్ని వూహించుకున్నాను. "ఆజ్ షరమానేం–కీ–రాత్ హై...." వంటి చరణాలు విన్నప్పుడు అంతా అర్థమయ్యింది.

ఆడాళ్ళు హుషారుగా ఒక పాట తర్వాత మరోపాట పాడుతున్నారు. సంతోషంతో పెళ్ళికూతురి ముఖంలోకిచూసి స్వరాన్ని హెచ్చించి చిరునవ్వులు వొలకబోస్తున్నారు. పెళ్ళికూతురు మరీ సిగ్గుపడి, మోకాళ్ళమీద ముఖంవాల్చి, రెప్పల్ని కిందకుజార్చి పాదాల్ని చూసుకుంటోంది.

అలా కూర్చున్న ఆడాళ్ళంటే నాకెంతోయిష్టం. స్త్రీని పురుషుడినుండి ప్రత్యేకించి చూపేవి—కన్నీళ్ళు, సిగ్గూ—యీ రెండే. అవి లేకపోతే స్త్రీ ముఖంలో లాలిత్యం వుండదు. పురుషుడి ముఖానికీ, స్త్రీ ముఖానికీ అట్టే భేదమే కనిపించదు. స్త్రీ తను వుంటున్నదానికన్నా అందంగా కనిపించేది రెండే రెండుసార్లు. ఒకటి—దుఃఖంలో వున్నప్పుడు, రెండోది—సిగ్గుపడుతున్నప్పుడు.

యూసఫాను ధైర్యంగా ఎదురుగా నిలుచుని చూసే అవకాశం లేకపోయింది నాకు. వాళ్ళకు ఘోషా. పరపురుషుల కంటపడేందుకు వాళ్ళు ఇష్టపడరు. అందుచేత రహస్యంగా యూసఫాను, మూసిన కిటికీమధ్య ఖాళీ లోంచి, చూడాల్సి వచ్చింది.

నిజానికి యూసఫా ఒక్కర్తీ కూర్చునివుంటే ఆమెను చూడ్డానికి నా కెలాంటి అభ్యంతరమూ వుండేదికాదు. ఆమె బంధువులమధ్య కూర్చుంది. ఆ బంధువులు కొత్తవాళ్ళు కావడంచేత, ఆ ఘోషాస్త్రీల ముందు కూర్చుని యూసఫాను చూసే అవకాశం లేకపోయింది.

యూసఫాను అంతకుముందు ఎన్నోసార్లు చూశాను. దొంగచాటుగా, రహస్యంగా ఏ తలుపువారనుంచో, కిటికీలోంచో, దొడ్లో కుళాయివద్ద నీళ్ళు పట్టుకుంటుంటే అటువైపుగా వెళుతూ ఓరగానో—చూడలేదు. ఎదురుగా రెండుగజాల దూరంలో నిలుచుని కబుర్లు చెప్తున్నప్పుడూ, నా వెనక దగ్గరగా నుంచొని నే వేస్తున్న చిత్రంలోకి వంగి చూస్తున్నప్పుడూ, అకస్మాత్తుగా ఎదురుపడి అరడుగు దూరంలో నిలబడి క్షణంసేపు నా కళ్ళల్లోకిచూసి పక్కకు తప్పుకున్నప్పుడూ సన్నిహితంగా, సూటిగా, తృప్తిగా అనేకమార్లు చూశాను.

"యూసఫా! నీ చిత్రం వేసిస్తాను వస్తావా?" అంటే సంతోషంతో తలూపి ఎదురుగా వచ్చి కూర్చునేది. నిముషాలతరబడి ఆమె అందాన్ని చూస్తూ కూర్చుండిపోయేవాడిని.

యూసఫా యింకా చిన్నపిల్ల. అప్పుడే యౌవ్వనంలోకి అడుగు పెడుతోంది అదృష్టం అనుకూలించి మంచి సంబంధం ఒకటి రాగానే పెళ్ళి చేసేస్తున్నారు.

ఆ యింట్లో ఏడాదిగా ఓ గది అద్దెకు తీసుకుని వుండడంవల్ల ఇంచుమించుగా ఆ యింట్లో ఒక మనిషిగా అయిపోయాను. అరమరికలు లేకుండా ఆ యింటిల్లిపాదీ స్వేచ్ఛగా మాట్లాడుతుంటారు. ఆ భాష అంతగా నాకు రాదు. అయినా ఎలాగో మాట్లాడుతాను. వాళ్ళు అర్థం చేసుకుంటారు. ఒక్కోసారి నవ్వుకుంటారు.

తొలిసారి యూసఫాను చూసినప్పుడు ఆమె మరీ చిన్నపిల్ల. చిలిపిగా గెంతేది. ఆ తర్వాత ఆరేడు నెలలకు తొలి యౌవ్వనపు రేఖ తొడిగి; సిగ్గునూ, సౌందర్యాన్నీ పెంచుకుని; గాంభీర్యాన్నీ నిండుదనాన్నీ సంతరించుకుంది.

దొంగచాటుగా చూస్తోన్నా తృప్తిగా చాలాసేపు చూశాను. నాకు నిద్ర ముంచుకొస్తోంది. అర్ధరాత్రి దాటినా ఆడాళ్ళు ఆనందంతో పాటలు పాడుతూనే వున్నారు. పిల్లకాయలు నిద్రకాగలేక ఎప్పుడో వెళ్ళిపోయారు. మెల్లగా కదిలి పక్కమీదకు చేరాను. నిశ్శబ్దంలో మద్దెలచప్పుడు, గాజుల గలగలలు, శ్రావ్యమైన కంఠాలు గాలిని ఆవరించి వంపులుతిరిగి వినిపిస్తున్నాయి. మెల మెల్లగా నిద్రమత్తు రెప్పలమీదకు పాకుతోంది. ఏ లోకంలోనో నక్షత్రాలు నాట్యంచేసి

పాడుతున్నట్టుగా మెల్లగా ఆ గానం వినిపించి, దూరంగా ఏ అగాధంలోకో జారిపోయినట్టు—ఏదో తెలియని విచిత్రమైన అనుభూతుల్ని దాటుకుని నిద్ర లోకి జారిపోయింది.

ఎప్పుడో తెలివి వొచ్చింది. ఇంకా పాట వినిపిస్తూనేవుంది. టైము చూశాను. రెండయింది. ఇంత సేపూ అలా ఎడతెగకుండా పాడుతూనే వున్నారు కాబోలు! లేచి, కిటికీలోంచి చూశాను. అలసిపోయిన ఛాయలు నా కెక్కడా వాళ్ళల్లో కనిపించలేదు. బహుశా ఆ మద్దెల అందుకేనేమో. నిద్రనుండి దూరంగా తేలిపోయి, ఆ పిల్ల పాదాలకూ, చేతులకూ పెట్టిన గోరింటాకు ఆరిపోయేవరకూ ఉంటారు కాబోలు!

యూసఫాను చూశాను. ముసుగు జారిపోయింది. రెప్పలు నిద్రమత్తులో తడిసి, బరువెక్కి వాలిపోతున్నాయి. బలవంతంగా వాటిని పైకెత్తిపట్టుకుం టోంది. అలా సగం వాలిపోయిన ఆ మత్తు కళ్ళచుట్టూ బలమైన ఆకర్షణ గూడుకట్టుకుంది. ఆ కళ్ళ చీకటి అంచులమధ్య కాంతికరిగిన తెల్లటి చూపుల్లో ఆకర్షణే కాదు అందమూ పెనవేసుకుంది. ఆ మత్తుకళ్ళు ఆమె మరోలోకంలో విహరిస్తున్నదనడానికి సాక్షులు. ఆలోచనల పడవకు కనురెప్పలు తెరచాపలు. తెరచాప పట్టితే పడవ మరింత వేగాన్ని పుంజుకుంటుంది. ఆలోచనలు కొత్త లోకాల్లోకి పరుగులు తీస్తాయి. యూసఫా అంత అర్ధరాత్రివేళ ఏ మధురమైన లోకంలో విహరిస్తున్నదో మరి!

నా ఆలోచనలు నా మీదకే మళ్ళాయి. నా చూపులు నా జీవితంమీదే నిలిచిపోయాయి. ఇలా యీ రాత్రిళ్ళు ఒంటరితనంతో యింకా ఎన్నాళ్ళని నింపివుంచను? నా నిరీక్షణల కొసల్ని పట్టుకుని ఎవరో నా జీవితంలోకి ప్రవేశిస్తారని ఎందుకా ఆశ? రాత్రంతా ఆలోచనల్తోనే గడిచిపోయింది.

ఉదయం కుళాయి దగ్గర కనిపించింది యూసఫా కెంపులు పొదివి నట్టుగా అరచేతులు ఎర్రగా మెరిసిపోతున్నాయి. కుళాయి కింద చేతులు కడుక్కుంటున్నప్పుడు సన్నని నీటిధార ఆమె చేతుల మీదుగా దానిమ్మ గింజల్లా కిందకు జారుతోంది. పచ్చటి శరీరం కావడంవల్ల గోరింటాకు మరీ ఎర్రగా పండింది. ఆ గోరింటాకు రంగు పూర్తిగా పోయేవరకూ ఆ అమ్మాయి పుట్టింట్లోగాని, అత్తవారింట్లోగాని పని చెయ్యగూడదట. ఆ రంగు పోకుండా

దాచుకోవడం ఆమె విధి. ఏ పనీ చెయ్యకుండా తీరిగ్గా కొంతకాలంపాటు కూర్చోవచ్చు!

పెళ్ళికూతురయ్యాక సిగ్గెక్కువయినట్టుంది. కంగారు కంగారుగా చేతులు కడుక్కుని వెళ్ళిపోయింది. నాలో నేనే నవ్వుకున్నాను. స్త్రీలో మార్పు రావడానికి ఎంత సేపు కావాలి?

నాలుగు రోజుల తర్వాత ఒకరోజు పెళ్ళికొడుకు తరఫువాళ్ళు వచ్చారు. అమ్మాయికి వాళ్ళు పెట్టే ఖరీదైన బట్టలు, యిచ్చే కట్నమూ, బంగారు నగలూ పళ్ళాల్లో పెట్టుకుని, పెళ్ళికొడుకును వెంటబెట్టుకుని వచ్చారు. అప్పుడే పెళ్ళికొడుకును చూశాను. సిల్కు బుష్‌కోటు, ఉలెన్ ఫేంటు తొడుక్కున్నాడు. చేతికి వాచీ వుంది. జైపూర్‌లో అతను పనిచేస్తున్నాడట. పెళ్ళవగానే అమ్మాయిని అక్కడకు తీసుకుపోతాడట.

ఆమె భవిష్యత్ జీవితం గురించి యెన్నో ఆలోచనలు తలెత్తాయినాకు. అంత అందమయిన అమ్మాయి జీవితం ఏలావుంటుందోనన్న ఆలోచన.

యూసఫాను గురించి అంతగా ఆలోచించకపోయేవాడినే. కాని ఆమె అంటే నాకు చాలా యిష్టం! అందమయిన అమ్మాయి గనుక యూసఫా అంటే నాకు చాలా యిష్టం.

యూసఫాను నేను ప్రేమిస్తున్నాను. అందమయిన గడ్డిపువ్వునూ, కొండరాళ్ళల్లో ప్రవహించే సెలయేటినీ, ఎండలు వెళ్ళిపోగానే ఆ సంవత్సరానికి తొలిసారిగా వచ్చే వర్షాన్నీ, ప్రతి తెల్లవారుఝామునా మా కుళాయికింద నిండుగావున్న బకెట్టులోకి కుళాయినుండి ఒక్కొక్క చుక్కే కారి నిద్రలేపే నీటి అందమయిన శబ్దాన్నీ, కొద్దిపాటి వర్షపు జల్లులో స్నానంచేసిన పృథివి వదిలిన కమ్మని సువాసననీ ప్రేమించినట్టుగా యూసఫాను కూడా ప్రేమిస్తున్నాను. అందుచేతే యూసఫాను గూర్చి యెక్కువగా ఆలోచించాల్సివస్తోంది.

పెళ్ళయిన వారం రోజులకే యూసఫా అత్తవారింటికి వెళ్ళిపోయింది. వెళ్ళిపోతున్నప్పుడుమాత్రం ధైర్యంగా అరుగుమీద నుంచొని తృప్తిగా చూశాను.

ఆ తరువాత ఆరు నెలలపాటు అదే ఇంట్లో వున్నాను కానీ ఈ ఆరు నెలల్లోనూ యూసఫా ఒకసారికూడా పుట్టింటికి రాలేదు.

చాలాకాలానికి ప్రభుత్వంవారు క్వార్టర్సుల్లో ఓ ఇల్లు ఇచ్చారు. చక్కగా వుంది. ఇంటికన్నా ఇంటి చుట్టూవున్న పరిసరాలు బావున్నాయి. ఆ ఇంట్లోకి వెళ్ళిపోయాను. వెళ్ళిన కొత్తలో రెండు మూడుసార్లు పాతయింటికి వచ్చాను. కాని ఆ తరువాత మళ్ళీ రాలేదు. ఇక్కడకు రావాలీ అంటే ప్రత్యేకంగా పనిగట్టుకొని రావాలి తీరా వచ్చినా ఏమున్నాయి మాట్లాడడానికి? యూసఫా అన్నయ్య రబ్బానీ ఏమిటేమిటో అడుగుతాడు. ఆ భాష అర్థం చేసుకోవడానికి నానా యిబ్బందీపడి, చివరకు వచ్చీరాని భాషలో ఏదో సమాధానం చెప్పాల్సి వస్తుంది. యూసఫా వుంటే కనీసం ఆమెను చూడడానికయినా వెళ్ళాలని అనిపించేది. కానీ, ఆమె వుందో లేదో. మరీ దూరం! రావాలంటే మాటలా. అందుకే అటువైపుగా వెళ్ళనేలేదు.

పట్టణంలో ఇల్లు దొరికిందీ అంటే వివాహానికి ఓ అడ్డంకి తీరిపోయిం దన్నమాటే! ఇల్లు దొరికిందని మావాళ్ళకి వుత్తరం రాస్తే తిరుగుటపాలో వివాహాన్ని గూర్చిన సలహా యిచ్చారువాళ్ళు. అక్కడికీ వాళ్ళ సలహాని పెడ చెవినిపెట్టి అర్ధసంవత్సరం ఎలాగో నెట్టుకొచ్చానుగాని యిక లాభం లేక పోయింది. అయినా యెంతకాలమని ఈ నిరీక్షణల్ని ఊపిరిగా పీల్చి బతికేది? జీవితం మనకేమీ యివ్వదు. మనమే జీవితాన్ని అందుకోవాలి.

ఇల్లూ, ఇంటికితగిన ఇల్లాలూ అమరాయి. బాధ్యతలూ పెరిగాయి. ఆలోచనలకు యిప్పుడు ఒక గమ్యం ఏర్పడింది. ఆఫీసు విడిచిపెట్టాక రోడ్లను కొలుస్తూ తిరగాల్సిన అవసరం లేకపోయిందిప్పుడు. అందమయిన కలలపంట పండి, జీవితంనిండా రంగురంగుల పూలు విచ్చుకున్నాయి. సీతాకోక చిలకలమై తిరిగి తిరిగి అలసిపోయి, ఏ అనుభవాల ఆకులచాటునో నిద్ర పోయి, మర్నాటి సూర్యుడితోపాటు నిద్ర లేవడంతోనే సరిపోతోంది. ఎప్పటి సూర్యుడే అయినా ప్రతిరోజూ సూర్యుడు కొత్తగానే వుంటాడు. ఆ కొత్తదనం అతను చేసిన రాత్రి నిష్క్రమణలోనే వుంది. కొత్తజీవితంలో కూడా కాస్తంత విరహం వుంటేనే అందం. కొద్దిసేపు కనిపించి దూరంగా తప్పుకుని, కాలాన్ని నిరీక్షణలతో నింపి, ఆ తరువాత ఆ నిరీక్షణల కొసల్ని పట్టుకుంటూ దగ్గరకు దిగొచ్చి, చిరునవ్వుల పూలు పండించి, ఆ పూలతో జీవితానికి పూలపాన్పు పరిచి, ఆ పైన పవ్వళించి, కలల్లోవూగి, వూగించి, పూర్తిగా మత్తు వొదల

కుండానే దూరంగా తొలిగి, మళ్ళీ దగ్గరికొచ్చి, మళ్ళీ దూరమయి, మళ్ళీవచ్చి.... అలా నిత్యహరితంగా జీవితాన్ని చేసుకోవాలనే ప్రయత్నం. ఆ ప్రయత్నంలో కాలంకూడా తెలీడంలేదు

రెండేళ్ళు గడిచిపోయాయి.

మరో ఏడాదికూడా గడిచిపోతూ—పోతూవుంది.

ఆఫీసునుంచి వస్తున్నాను. పూలు కొందామని రోడ్డు దాటుతోంటే వెనకనించి యెవరో సైకిలు మీద పెట్టేసి. క్షమాపణలు చెప్పుకుంటున్నారు. వెనక్కు తిరిగాను. రబ్బానీ!

"ఓహ్! మీరా!! యెంతకాలానికి కలుసుకున్నాం. చాలా విచిత్రంగా కలుసుకున్నాం కదూ. పూర్తిగా మర్చిపోయినట్టున్నారు మమ్మల్ని" అన్నాడు.

మర్చిపోలేదనీ, అప్పుడప్పుడు యూసఫా జ్ఞాపకానికొస్తూనే వుంటుందనీ అతనితో ఎలాచెప్పను?

"రండి కాస్త 'చాయ్' పుచ్చుకుందాం. ఎంతకాలం అయ్యిందో కలుసుకుని" అన్నాడు.

ఇద్దరమూ ఇరానీ హోటల్లోకి వెళ్ళి కూర్చున్నాం.

అతను యీమధ్యే కొత్తగా ఉద్యోగంలో చేరాడట. ఆ విషయం చెప్తున్నాడు. తెలుగులోనే మాట్లాడుతున్నాడు. ఆ సంగతి అకస్మాత్తుగా జ్ఞాపకం వచ్చింది. అదే అడిగాను.

"ఎంతకాలం కిందటిమాట! ఇప్పటికి అప్పుడే నాలుగేళ్ళు గడిచాయి కదా. ఆ మాత్రం నేర్చుకోలేమంటారా" అన్నాడు.

నా వివాహం గురించీ, ఉద్యోగంలో ప్రమోషను గురించీ చెప్పాను. చాలా సంతోషించాడు. బలవంతంగా నాచేత స్వీటు తినిపించాడు.

టీ తాగి చాలా సేపు మాట్లాడుకుంటూ కూర్చున్నాం.

"ఇప్పుడు మీకు పనేముంది....మా ఇంటికి వెళ్దాం, రండి" అన్నాడు రబ్బాని.

ఇంటికివెళ్ళి, ఆవిడను తీసుకుని షాపింగ్‌కని మళ్ళీ బజారుకు రావాల్సిన పనుంది. అందుకని "తర్వాత వస్తాలే" అన్నాను.

"మరి మీకు మాయిల్లు తెలియొద్దూ. పాతయింట్లో కాదుగదా యిప్పుడు వుండేది. ఆ యిల్లు అమ్మేయాల్సి వచ్చింది. నాంపల్లి బజార్‌ఘాట్‌లో వుంటున్నాం—అద్దెఇంట్లో" అన్నాడు.

చక్కటియిల్లే. పాపం! పరిస్థితులు బాగోక అమ్మేయాల్సి వచ్చింది కాబోలు. ఆలోచిస్తున్నాను.

"రండి, ఇంటికి వెళ్దాం" అన్నాడు లేచినుంచుని.

"ఇవ్వాళ రాలేను. రేపొస్తాలే" అన్నాను.

"సరేలెండి. రేపు సాయంకాలం యిదేటైముకు యీ హోటలు దగ్గరకువస్తే అక్కడినుండి యింటికి వెళ్దాం. రాత్రి ఇంటికి వెళ్ళిన తర్వాత అమ్మతోను, యూసఫాతోను చెప్తాను మీరు వస్తారని" అన్నాడు.

"యూసఫా పుట్టింటికి వచ్చిందా?" అన్నాను.

"ఇక్కడే వుంటోంది" అన్నాడు.

చాలా ఆనందం కలిగిందినాకు. ఇన్నాళ్ళకు మళ్ళీ యూసఫాను చూడ గలుగుతున్నాను. ఈ నాలుగేళ్ళలోనూ ఆమె చాలా మారిపోయి వుంటుంది కాబోలు. ఒకరో, యిద్దరో పిల్లలు చుట్టూచేరి వేధించుకు తింటుంటారు. ఆమె సిల్వార్, పైజామాల్ని వదిలి చీరల్ని కడుతూ వుంటుంది. అరచేతి సైజులో పసుపు, నీలంరంగు పూల అంచుల ఎర్రచీర కడుతుంది. ఆ చీరంటే వాళ్ళమ్మకు ఇష్టం. బహుశా ఆమెకుకూడా ఇష్టమే అవుతుంది. అంతకు ముందుకన్నా కొద్దిగా లావెక్కినా ఎక్కవచ్చు. పూర్వం అంత అందంగా యిప్పుడు వుంటుందో వుండదో? పిల్లలు పుడుతూంటే అందం ఏమయిపోతూ వుంటుంది మరి!

"పిల్లలా?" అన్నాను.

"ఒకడే—అబ్బాయి, భలే అల్లరివాడులెండి" అన్నాడు.

అంతకన్నా యింకేం అడగను? యూసఫాను గురించి ఇంకా ఇంకా తెలుసుకోవాలని వుంది. అన్నీ వొక్కసారే అడిగితే ఏమనుకుంటాడు?

మర్నాడు ఆరింటికి అక్కడకు వస్తాననిచెప్పి వెళ్ళిపోయాను.

చెప్పినట్లుగా ఆ మరుసటిరోజు అతడిని కలుసుకున్నాను. నే వచ్చేసరికి నాగురించే ఎదురుచూస్తూ వున్నాడు. ఇద్దరమూ ఇంటికి బయలుదేరాం.

"మీరు కలిశారని, ఇక్కడకు వస్తారని అమ్మతో చెప్పాను. చాలా సంతోషించింది" అన్నాడు.

అలానే యూసఫాను గురించి ఏమన్నా చెప్తే బావుండును.

చాలా సేపు చూసిచూసి అతను ఆ విషయం ఏమీ మాట్లాడకపోతే నేనే అడిగాను "యూసఫావచ్చి ఎంతకాలమైంది?" అని.

అతను పరధ్యాన్నంగా నావైపు చూసి "ఏడాదిగా ఇక్కడే వుంటోంది" అన్నాడు.

అయిదునిమిషాల తరువాత అతనే చెప్పాడు—ఆమె భర్త ఆ రాష్ట్రంలో ఓ అమ్మాయిని ప్రేమించి రహస్యంగా పెళ్ళి చేసుకున్నాడట. ఆ యిద్దరూ కలిసి యూసఫాను పుట్టింటికి తరిమేశారట. అప్పటినుండీ యూసఫా ఇక్కడే ఉంటోందట.

క్షణంపాటు స్థబ్దున్నయిపోయాను. ఇది సంభవమేనా? అని అనిపిస్తోంది నాకు. ఇంత అందమయిన యూసఫాను యింత నిర్దాక్షిణ్యంగా తరిమేసే మూర్ఖులుంటారని అనుకోలేకపోతున్నాను. మూడేళ్ళు సంసారంచేసి. ఓ పిల్లడిని కని, యిలా చేసేవాళ్ళను ఏమనాలో అర్థం కావడంలేదు. లేకపోతే ఇందులో యూసఫా తప్పేమన్నా వున్నదేమోనని ఆలోచించాల్సి వస్తున్నది.

"మరి ఆమెకూ, ఆమె పిల్లడికీ ఆధారమో" అన్నాను.

"ఆమెకు పదివేలు వచ్చాయి. వదిలిపెట్టేస్తే అంత డబ్బు ఇస్తామని పెళ్ళయ్యేముందు వప్పుకున్నారు. అలా ముందుగా నిర్ణయించుకోవడం మా ఆచారం" అన్నాడు.

ఇంతా విన్న తరువాత ఎలా చూడను? మబ్బుపట్టిన రాత్రి చంద్రుడ్నీ, మోడయిపోయిన తరువాత చెట్టునూ, అమావాస్యనాడు ప్రకృతినీ, మంచుబిందువులు అల్లల్లాడి గాలికి రాలిపోయిన తరువాత తామర ఆకునూ, ప్రభాతంలో కలువనూ చూడ్డంలో ప్రయోజనం ఏమిటి? వాటిలోకూడా అందం వుందనీ వప్పుకుంటాను. కాని ఆ అందాన్ని భరిస్తూ దుఃఖాన్ని దాచుకునే హృదయం

నాకులేదు. వాటిని చూసినప్పుడు రాలిపోయిన వాటి తొలిసౌందర్యం జ్ఞాపకానికి వస్తుంది. అప్పుడనుకుంటాను—నేను ప్రేమించే యీ సౌందర్యమంతా యిలా నాశనమైపోతున్నదే, యీ అశాశ్వతమైన సౌందర్యాన్ని నేను ఎందుకు ప్రేమిస్తున్నాను? నా కళ్ళకు అక్షయమైన సౌందర్యం ఎందుకు కనిపించదు, నా మనసు ఎందుకు ఆ సౌందర్యపు మూలల్లోకి వెళ్ళదు—అని. క్షణికమైన యీ సౌందర్యాన్ని ప్రేమిస్తున్నానే అని నా మనసు అప్పుడు బాధపడుతుంది.

అందుకని నేను వెళ్ళదలచుకోలేదు. రబ్బానీని ఆపి "ఇవ్వాళ రాలేను. మరోరోజు వస్తాను. అడ్రసు యివ్వు" అన్నాను.

అతను ఆశ్చర్యపోయాడు. విచిత్రంగా నా ముఖంలోకి చూసి "అదేమిటి అలా అంటున్నారు!" అన్నాడు.

"ఏమిటో—అకస్మాత్తుగా కడుపులో తిప్పుతోంది. యింటికి వెళ్ళిపోతాను" అన్నాను.

"వుండండి. ఇంటికివెళ్తే మందు తీసుకోవచ్చు. మా యూసఫా వాళ్ళాయన ఆయుర్వేద డాక్టరు" అన్నాడు రబ్బానీ.

అతను ఏమంటున్నాడో నాకు అర్థంకాలేదు. ప్రశ్నార్థకంగా అతని ముఖంలోకి చూశాను.

అది అతను గుర్తించాడు.

"అదేలెండి. మొన్ననే మా యూసఫాకు మళ్ళీ పెళ్ళిచేశాం, మనిషి మంచివాడే. ప్రాక్టీసుకూడా బాగావుంది. ఇప్పుడు అంతా కలిసేవుంటున్నాం" అన్నాడు.

ఎందుకో నాకిక యూసఫాను చూడాలనిపించలేదు.

ఆయుర్వేదమందు నాకు అలవాటు లేదనిచెప్పి, మరోసారి కలుస్తానని అడ్రసు తీసుకుని యింటికి బయలుదేరాను.

అడ్రసు కాగితం మధ్యదారిలో ఎప్పుడో ఉండచుట్టి కిందపడేశాను.

వస్తూవస్తూ దార్లో తమిళనాడు హేండీక్రాఫ్ట్స్ ఎగ్జిబిషన్ లేపాక్షి షోరూములో జరుగుతుంటే చూద్దామని వెళ్ళాను. ఓ వాల్ హేంగింగ్ ఇత్తడి

ప్లేటు బాగా నచ్చింది. మంచి లతలువుండి మధ్యలో రాగిరేకుమీద ఉబ్బెత్తుగా దశావతారాల బొమ్మలుచేసి అతికించారు. ఇత్తడి ప్లేటుమీద రాగిబొమ్మల అతుకువల్ల ఆ ప్లేటు మరీ రాణిస్తోంది. ధరకాస్త ఎక్కువే. కాని పనితనం బాగుంది.

ఆ ప్లేటు కొన్నాను.

ఇంటికొచ్చాక అప్పటికప్పుడే గోడకు వేలాడదీశాను. ఇంటిదగ్గర మరీ అందంగా అనిపించింది. దాన్నే చూస్తున్నాను. అదేపనిగా దాన్నే చూస్తుంటే నాకు చప్పున యూసఫా గుర్తుకొచ్చింది.

అతుకుపడినదే అయినా ఆ అతుకువల్ల యూసఫా జీవితం రాణించదను కోవడం అర్థంలేదనిపించింది.

ఒకసారి ఆమెను చూస్తే ఆ విషయం తెలిసిపోతుందికదా—అను కున్నాను కాని అడ్రసు కాగితం ఎప్పుడో పడేశాను

ఈసారి రబ్బానీ కనిపిస్తే తప్పకుండా యింటికి వెళ్ళాలని నిర్ణయించు కున్నాను.

కాని ఇంతకాలం గడిచినా మళ్ళీ రబ్బానీ నాకు కనిపించనేలేదు!

(1967)

★